ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
ఆదివారం 08 డిసెంబరు 2024 www.prajaaswaramdaily.com 2 pm

### కొండగట్టుకు వెళ్లొస్తుండగా..
# రోడ్డు ప్రమాదం.. నలుగురు మృతి

**మృతులు ఆంధ్ర రాష్ట్రం నెల్లూరు జిల్లా వాసులు**




పిడుగురాళ్ల(ఆంధ్ర) : పల్నాడు జిల్లాలోని బ్రాహ్మణపల్లి సమీపంలోని అద్దంకి-నార్కట్‌పల్లి హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గీతిక స్కూల్ సమీపంలో కారు చెట్టును ఢీకొన్న ఘటనలో నలుగురు మృతి చెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం పిడుగురాళ్ల ఆసుపత్రికి తరలించారు. మృతులు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి మండలం సిరిపురం వాసులు తుళ్లూరు సురేష్, వనిత, యోగులు, వెంకటేశ్వర్లుగా గుర్తించారు. తెలంగాణలోని కొండగట్టులోని ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకుని, కొత్త కారుకు పూజలు చేసుకుని తిరిగి వెళ్లుండగా ప్రమాదం జరిగింది. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

# చార్జిషీట్ కాదు రిప్రజెంటేషన్

**బీఆర్ఎస్; బీజేపీ వేర్వేరు కాదు**
**మంత్రి పొన్నం**



హైదరాబాద్ : ప్రతిపక్షాలు ఇచ్చింది చార్జిషీట్ కాదు రిప్రజెంటేషన్ అని మంత్రి పొన్నం అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటి నెల నుంచే విమర్శిస్తున్నారన్నారు. మళ్లీ ఏడాది కాగానే చార్జిషీట్ అంటే ఇది భావ్యం కాదు అని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ వేర్వేరు కాదు అని ఒక్కటేనని మంత్రి అన్నారు. ప్రభుత్వాన్ని కూలగొడతామంటున్నారని మండిపడ్డారు. ఇద్దరు కలిసి ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇది తెలంగాణ ప్రజలు గమనించాలని అన్నారు.

# కేసీఆర్ అధ్యక్షతన
# బీఆర్ఎస్ఎల్పీ సమావేశం

**ఎర్రవల్లి ఫామ్ హౌస్ చేరుకుంటున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు**


**ఇప్పటికే చేరుకున్న కేటీఆర్, హరీశ్ రావు, కవిత**



హైదరాబాద్ : కాసేపట్లో ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కేసీఆర్ అధ్యక్ష తన బీఆర్ఎస్ఎల్పీ సమావేశం నిర్వహించనున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. ఇప్పటికే ఎర్రవల్లి ఫామ్ హౌస్ కు కేటీఆర్, హరీశ్ రావు, కవిత చేరుకున్నారు.

# ఏడాది పాలన-ఎడతెగని వంచన’

**మాజీ మంత్రి హరీశ్ రావు**
**బీఆర్ఎస్ ఛార్జిషీట్ విడుదల**



హైదరాబాద్: కేసీఆర్ పాలనలో ఇరిగేషన్ పెరిగితే రేవంత్ పాలనలో ఇరిటేషన్ పెరిగిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యంగా మారిందని విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ ఏడాది పాలనపై ‘ఏడాది పాలనఎడతెగని వంచన’ పేరుతో బీఆర్ఎస్ ఛార్జిషీట్‌ను విడుదల చేశారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా నిర్బంధాలు కొనసాగుతున్నాయని చెప్పారు. రేవంత్ రెడ్డి ఊసరవెల్లిలా రంగులు మార్చుతున్నాడని, దుర్భాషా దురంధరుడు అని బిరుదు ఇవ్వాలన్నారు.

‘కాంగ్రెస్ ఏడాది పాలనపై చార్జిషీట్. ప్రజలు, ప్రజా సమస్యలు, ఆరు గ్యారంటీల అమలుపై చార్జిషీట్. కాంగ్రెస్ ఏడాది పాలన ప్రజా పీడిత పాలన. ఏడాది కాంగ్రెస్ పాలనలో ప్రజస్వామ్యం అపహాస్యంగా మారింది. తెలంగాణ ఉద్యమంలోనూ ఇలాంటి నిర్బంధాలు, నిరంకుశత్వం చూడలేదు. స్కూళ్ల ముందు పోలీస్ పికెట్ల గురించి ఏనాడైనా విన్నామా?. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా నిర్బంధాలు కొనసాగుతున్నాయి. కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అయింది. మీడియా, సోషల్ మీడియాలపై ఆంక్షలు విధించారు. బీఆర్ఎస్ నాయులు, ప్రశ్నించే గొంతులను నొక్కుతున్నారు. గిరిజన బిడ్డల మీద లాఠీచార్జి చేశారు. తిట్లు, ఒట్లు, పోట్లు ఇదే రేవంత్ పాలన. పోలీసులతోనే పోలీసు కుటుంబాలను కొట్టించారు. ప్రతికూల దృక్పథంతో రేవంత్ పాలన ప్రారంభమైంది. ఉన్న పరిశ్రమలు తరలిపోతున్నాయి. రియల్ ఎస్టేట్ రంగం ఢమాలైంది. 6 గ్యారంటీలు, 420 హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైంది. సీఎం ఛాంబర్‌కు ఎవరూ వెళ్లకుండా ఆంక్షలు విధించారు. దేశంలోనే రేవంత్ ఏడో గ్యారంటీ ప్రజాస్వామ్యం నవ్వులపాలైంది. పదేండ్ల కేసీఆర్ పాలన ఎట్లుండె.. ఏడాది కాంగ్రెస్ పాలన ఎట్లుంది?. రూ.60 కోట్లున్న రాష్ట్ర బడ్జెట్‌ను రూ.3 లక్షల కోట్లకు కేసీఆర్ పంచారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, విద్యార్థులు, నిరుద్యోలు, రైతులు రోడ్డెక్కారని అన్నారు.


### గుర్తు తెలియని వాహనం ఢీకొని
# ఇద్దరు కానిస్టేబుళ్లు మృతి



గజ్వేల్: సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఆదివారం ఉదయం పట్టణంలోని జాలిగామ బైపాస్ రోడ్డుపై గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు కానిస్టేబుళ్లు మృతిచెందారు. మృతులను పరందాములు, వెంకటేశ్‌గా గుర్తించారు. పరందాములు రాయపోల్ పోలీస్ స్టేషన్‌లో, వెంకటేశ్ దౌల్తాబాద్ పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఈసీఎల్‌లో జరుగుతున్న మారథాన్ రన్నింగ్‌లో పాల్గొనడానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ప్రమాదం జరిగింది.

# మంచు కుటుంబంలో విభేదాలు?





హైదరాబాద్ : మంచు ఇంట్లో వివాదం చెలరేగినట్లు ఉదయం నుంచి వార్తలు వైరల్ అయ్యాయి. తనపై, తన భార్యపై తన తండ్రి మంచు మోహన్ బాబు దాడి చేశారని మంచు మనోజ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడని, గాయాలతోనే పీఎస్‌కి వెళ్లిన మనోజ్ మోహన్ బాబుపై హైదరాబాద్‌లోని పహాడి షరీఫ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదును అందించినట్లు వార్తలు వచ్చాయి. మరోవైపు మోహన్ బాబు కూడా మనోజ్‌పై ఫిర్యాదు చేసినట్లు వార్తలు వచ్చాయి. తన కొడుకు మంచు మనోజ్ తనపై దాడి చేశాడని మోహన్ బాబు ఫిర్యాదు చేసినట్లు న్యూస్ వైరల్ అయ్యింది. ఆస్తులు, స్కూల్ వ్యవహారం విషయంలో ఈ గొడవ అయినట్లు పలు కథనాలు వచ్చాయి.

**మోహన్ బాబుపై ఫిర్యాదు?**

టాలీవుడ్ సీనియర్ కథానాయకుడు మంచు మోహన్ బాబుపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. మంచు మనోజ్‌తో పాటు అతడి భార్యపై మోహన్ బాబు దాడిచేశాడని ఆయన కొడుకు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గాయాలతోనే పీఎస్‌కి వెళ్లిన మనోజ్ ఫిర్యాదును అందించాడు. ఆస్తులు, స్కూల్ వ్యవహారంపై ఈ గొడవలు జరిగినట్లు తెలుస్తుంది.

**మా కుటుంబంపై అసత్య ప్రచారాలు చేయొద్దు : మోహన్‌బాబు**

మా మీద వస్తున్న వార్తలు అబద్ధమని, ఇటువంటి అసత్య ప్రచారలు చేయొద్దంటూ వార్తలు రాసిన పలు మీడియాలకు సూచించింది. సినీ నటుడు మంచు మోహన్ బాబుపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయినట్లు ఉదయం నుంచి వార్తలు వస్తున్న విషయం తెలిసిందే.

# నటుడు జయరామ్ కుమారుడి వివాహం

**కేరళ.. శ్రీకృష్ణ దేవాలయంలో వేడుక**

చెన్నై : జయరామ్ తనయుడు, నటుడు కాళిదాస్ ఓ ఇంటివాడయ్యారు. మోడల్ తరిణిని పెళ్లి చేసుకున్నారు. కేరళలోని గురువాయూర్ శ్రీకృష్ణ దేవాలయంలో ఆదివారం ఉదయం జరిగిన వేడుకకు ఇరు కుటుంబాలతోపాటు కేంద్ర పర్యాటక సహాయ మంత్రి సురేశ్‌గోపి దంపతులు హాజరయ్యారు. పెళ్లి ఫొటోలను కాళిదాస్ సోషల్ మీడియా వేదికగా పంచుకోగా.. అభిమానులు, నెటిజన్లు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

